ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రాజధాని అభివృద్ధికి పెద్దపీట

- విజయవాడ మెట్రోకు కేంద్రం ఆమోదం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' సదస్సులో సిఎం చంద్రబాబు



సదస్సులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట ఏడాది పాలనపై వెలగపూడిలో సోమవారం నిర్వహించిన సదస్సులో సిఎం ప్రసంగించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి, లోకేష్ తదితరులు జ్యోతిప్రజ్వలన చేయగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్, ఉన్నతాధికారులు, హెచ్వోడీలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు హాజరై ఏడాది పాలనలో సంక్షేమంపై సమీక్ష... అభివృద్ధిపై అవలోకనం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

సిఎం మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రానికి 2014లోనే అమరావతిని ఎంపిక చేశామని, 2019 వరకు నిర్మాణాలు ప్రారంభించగా వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యం చేసిందన్నారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారన్నారు. వైసిపి విధ్వంసకర పరిపాలనకు ప్రజలు చరమగీతం పాడి 2024లో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో నిర్మాణానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపింది. కేంద్రంతో పొత్తు ఉండటం వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తున్నామన్నారు. కేంద్రం సహకారం లేకుంటే ఊపిరి కూడా పీల్చుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడుతామని, పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు మాటిచ్చామని ఇందులో భాగంగా మూడు పార్టీల సమన్వయంతో వేగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ▶ 2లో

ఆక్రమాలు ఆపాలంటే సన్నబియ్యం ఇవ్వండి

- ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ విధానాలు
- సచివాలయాలు కేంద్రంగా ప్రతి పనికీ లంచాలు
- రాజ్యాంగ విరుద్ధంగా పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు
- గత ప్రభుత్వ తప్పిదాలనే కొనసాగిస్తున్న కూటమి
- సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు డి.రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

పజాశక్తి-సత్తెనపల్లి

గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పిదాలను తాము సరిదిద్ది సూపరిపాలనను అందుబాటులోకి తెస్తామన్న కూటమి ప్రభుత్వం కూడా అవే తప్పుడు విధానాలను కొనసాగిస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. ముప్పాళ్ల మండలం మాదలలో సిపిఎం బృందం సోమవారం పర్యటించింది. అనంతరం సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో విలేకర్లతో రమాదేవి మాట్లాడారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందని, దీనికి అడ్డుకట్ట వేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే సన్నబియ్యం సరఫరా చేయాలని సూచించారు. ఇంటి వద్దకే రేషన్ బియ్యం వాహనాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. 1 నుండి 5 తరగతుల వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలల నుండి 3, 4, 5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూల్‌లో విలీనం చేయడం వల్ల ▶ 2లో

మహిళల హత్య కేసులో ముగ్గురు అరెస్టు

బంగారం, నగదు కోసం ఇంటి సమీపంలో వ్యక్తులే హతమార్చినట్లు నిర్ధారణ - 2 లో


అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు, కౌలురైతు సంఘం నాయకుల డిమాండ్ - కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి - 8 లో

తండ్రీకొడుకులు ఒకేరోజు మృతి

ప్రజాశక్తి - మాచర్ల





మృతులు షేక్ మస్తాన్‌వలి, జాకీర్ (ఫైల్ ఫొటోలు)

ఒకేరోజు తండ్రికుమారుడు మరణించటంతో ఆ కుటుంబంలో తీవ్ర నిషాదం నెలకొంది. కుమారుని మరణం తట్టుకోలేక అనారోగ్యంతో ఉన్న తండ్రి కూడా కొన్ని గంటల వ్యవధిలోనే మృతి చెందాడు. మాచర్ల పట్టణంలో సోమవారం జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ మస్తాన్‌వలి (70)కి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. మస్తాన్‌వలి కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నాడు. కుమారుడు షేక్ జాకీర్ (35) కూడా కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురై సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమారుడు మరణంతో తండ్రి మస్తాన్ వలి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. కుమారుడు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం సాయంత్రం శ్మశానానికి తీసుకెళ్లిన 10 నిమిషాలకే మస్తాన్‌వలి మృతి చెందాడు. ఒకేసారి కుమారుణ్ణి, భర్తను కోల్పోయిన ఆమె వేదన వర్ణనాతీతం. వారి ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు అవివాహితుడు.



ధర్నాలో అంగన్‌వాడీలు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవటం దారుణమని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ అన్నారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాల వర్తింపు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చు చేయాలని తదితర సమస్యలపై సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టగా అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్.కుమారి అధ్యక్షతన జరిగిన జరిగిన ధర్నాలో రమణ మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీలు అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నుండి ▶ 2లో

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులకు శ్రీకారం

- వాహనాల మళ్లింపు ప్రారంభం
- రహదారులపై ఆక్రమణలు, విస్తరణ చేపట్టని కార్పొరేషన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ ప్రస్తుత బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం ▶ 2లో





ఇరాన్‌పై అమెరికా దాడులకు నిరసన

ప్రజాశక్తి మంగళగిరి, మంగళగిరి రూరల్ : ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులను నిరసిస్తూ మంగళగిరి అంబేద్కర్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో, మంగళగిరి మండలం నిడమర్రులో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని అమెరికా విడనాడాలన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమే కాకుండా పశ్చిమ ఆసియా అస్థిరతకు దారి తీసే విధంగా అమెరికా సైనిక చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఒకవైపు ఇరాన్‌తో దౌత్య చర్చలు జరిపేందుకు రెండు వారాల సమయం ఇస్తున్నామని ప్రకటించిన ట్రంప్ ఏకపక్షంగా దాడులు చేయిస్తున్నాడని, పచ్చిమాసియాపై పెత్తనం కోసమే అమెరికా ఈ దుర్మార్గపు దాడులు చేస్తోందని విమర్శించారు. ప్రపంచ శాంతి కోసం ప్రపంచ మేధావులు పూనుకోవాలని కోరారు. నిరసనల్లో వామపక్ష పార్టీల నాయకులు వివి జవహర్లాల్, ఎస్ఎస్ చెంగయ్య, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, ఎం.బాలాజీ, ఎస్.గణేష్, చిన్ని తిరుపతయ్య, ఎ.ప్రభాకర్, ఎన్.బ్రహ్మేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, కె.కోటేశ్వరరావు, ఎం.రవి, ఎం.భాగ్యరాజు, జి.నాగేశ్వరరావు, కె.ప్రకాశరావు, ఎం.రాజముని, కె.స్టాలిన్, ఎం.అంకమ్మరావు, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రాజధాని అభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు వెళ్లిపోయారన్నారు. రాష్ట్రంపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పోయింది. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు. శాంతి భద్రతలు దెబ్బతీశారు. మూడ రాజధానుల అంటూ ఐదేళ్లు 'మూడు ముక్కలాడారు' అని విమర్శించారు. సంక్షేమం సాధికారత, పెట్టుబడుల సాధన, సంపద సృష్టి, ఆదాయం పెంచడం.. ఈ నాలుగింటిని సమానంగా తీసుకెళ్తేనే ఆర్థిక వ్యవస్థ మనుగడ సాధిస్తుందేని, కేంద్రంలో నరేంద్ర మోదీ సుస్థిర ఆర్థిక వ్యవస్థకు నాంది పలికారని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు తలసరి ఆదాయాన్ని పెంచామని అన్నారు. అధికారంలోకి రాగానే 4 కీలక హామీలపై సంతకాలు చేశానని, 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని చెప్పారు. సూపర్ సిక్స్ అమలు వేగం పుంజుకుందని, తల్లికి వందనం అమలు ఇందులో భాగమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సును కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, 33 పెట్టుబడి పాలసీలు తీసుకొచ్చామని అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది ఉండదన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 100 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో మైక్రో-మాక్రో విజన్ ప్లానింగ్ అమలు చేస్తున్నామన్నారు. రియల్ టైమ్ డేటా ఇంటిగ్రేట్ చేస్తున్నామని, ఎఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై దృష్టి పెట్టామని, అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని, ఏఐ యూనివర్సిటీ నెలకొల్పుతామని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్‌పి సతీష్‌కుమార్, జిల్లాకు చెందన ఎమ్మెల్యేలు, ఎంపిలు పాల్గొన్నారు.

ఆక్రమాలు ఆపాలంటే సన్నబియ్యం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలతోపాటు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒక కుటుంబంలో ఒక పిల్లవాడు 1వ తరగతి, మరో పిల్లవాడు 3వ తరగతి చదువుతుంటే స్కూల్ అయిపోయిన అనంతరం ఆ పిల్లలను ఇంటికి తీసుకురావడానికి తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఎక్కడ పనిచేస్తే అక్కడే వారికి ఫొటోలు తీసుకోకుండా అందర్నీ ఒకేచోటకు పిలవడం వల్ల మహిళలు నడిచి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉందని, కూలి డబ్బులు ప్రతి శనివారం ఇవ్వకుండా 3, 4 నెలలు పెండింగ్‌లో పెడుతున్నారని విమర్శించారు. పనుల్లేని సమయంలో ఉపాధి పనులు చూపకుండా వ్యవసాయ పనులు ప్రారంభమైన తర్వాత ఉపాధి హామీ పనులు చేయాలంటున్నారని, ఈ చర్యలన్నీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికేనని విమర్శించారు.

హిందూ మతాన్ని విమర్శించే వారి సంగతి తేలుస్తానంటూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను రమాదేవి ఖండించారు. దేవుళ్లను, మతాలను రక్షించడానికి రాజకీయాల్లోకి వచ్చారా? ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వచ్చారా? అని ప్రశ్నించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన మాట్లాడు తున్నారని విమర్శించారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లవుతోందని, అయితే గత 11 ఏళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అప్రకటితో ఎమర్జెన్సీని విధించిందని, ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా కేసులు పెట్టి జైల్లో పెడుతోందని అన్నారు. దేశంలో ప్రజలు అభద్రతా భావంలో జీవిస్నున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపితో స్నేహం చేస్తున్న టిడిపి, జనసేనకు ఎమెర్జెన్సీపై మాట్లాడే అర్హత లేదన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలలో పాఠ్యపుస్త కాలు అమ్ముతున్న విషయాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) బయటపెట్టినా అధికారులు ఎందుకు పట్టించుకో వడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ప్రతిచోటా లంచాలతోనే పనులు సాగిస్తున్నారని, సచివాలయ వ్యవస్థను ఆధారం చేసుకుని అధికార పక్ష నాయకుల సహకారంతో కొంతమంది బ్రోకరేజ్ చేసి ప్రతి పనికి లంచాలు గుంజుతున్నారని విమర్శించారు. సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు జి.మల్లేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు 42 రోజులపాటు సమ్మె చేయగా అప్పుడు మద్దతివ్వడంతోపాటు అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీనిచ్చిన టిడిపి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల పెంపు గురించి అడగొద్దంటూ అంగన్వాడి సంఘం నాయకులతో చర్చల సందర్భంగా ప్రభుత్వం తెగేసి చెబుతోందని, పైగా పనిభారం మరింత పెంచారని చెప్పారు. అమ్మఒడి పథకానికి సైతం వారిని దూరం చేశారన్నారు. అంగన్వాడీలకు యాప్‌లను రద్దు చేయడంతోపాటు సంక్షేమ పథకాలను వరింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పట్టణ కార్యదర్శి డి.విమల పాల్గొన్నారు.

మహిళల హత్య కేసులో ముగ్గురు అరెస్టు

బంగారం, నగదు కోసం ఇంటి సమీపంలో వ్యక్తులే హతమార్చినట్లు నిర్ధారణ



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి, ముసుగులో నిందితులు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఇటీవల ఇద్దరు మహిళలు హత్యకు గురైన కేసును పోలీసులు చేధించారు. సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. ఈ మేరకు వివరాలను స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ బి.జనార్ధనరావు, సిఐ ఎస్.రమేష్‌బాబు వెల్లడించారు. పరిమి రోడ్డులో నివసించే దాసరి రాజేశ్వరి (59), పీటా అంజమ్మ(70) ఈనెల 19న దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. మృతుల సమీప బంధువు మోర్ల రాజారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. నిందితులు మారీసుపేటకు చెందిన పెరవలి కుసుమకుమారి, పరిమి రోడ్డుకు చెందిన ఇళ్ల గోపికృష్ణ, చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ (మైనర్)గా గుర్తించి అరెస్టు చేశారు. మృతురాలు రాజేశ్వరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె చెన్నైలో ఉండగా కుమారుడు అమెరికాలో స్థిరపడ్డాడు. రాజేశ్వరి భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. మరో మహిళ పీటా అంజమ్మ భర్త కూడా రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అంజమ్మ, రాజేశ్వరి వియ్యపు రాళ్లు కావడంతో వీరిద్దరూ పరిమిరోడ్డులోనే కలిసి ఉంటున్నారు. వృద్ధుల ఆలనా పాలన సమీప బంధువు వీరేష్‌బాబు చూస్తున్నారు. మహిళలు ఇద్దరూ డాబా పై భాగంలో ఉండగా, కింది భాగంలో నాలుగు గదులు, గతంలో అప్పడాల ఫ్యాక్టరీ నిర్వహించిన ప్రాంతం ఖాళీగా ఉంది. దానిని అద్దెకిచ్చేందుకు బోర్డు పెట్టారు. మృతులు ఉంటున్న ఇంటికి సీసీ కెమెరాలు అమర్చిన రాజేశ్వరి కుమార్తె ధనలక్ష్మి చెన్నైలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. మృతుల వద్ద బంగారం, నగదు ఉందన్న విషయాన్ని గుర్తించిన నిందితులు వారిని హతమార్చి, వాటిని అపహరించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 19న మధ్యాహ్న సమయంలో మృతుల వద్దకు వచ్చి ఇంటిని అద్దెకు తీసుకునే నెపంతో మాటలు కలిపారు. ఇంట్లోకి చొరబడి తూకం రాయితో దాడి చేసి, గొంతుకు టవల్ బిగించి వారిని హతమార్చారు. రాజేశ్వరి మెడలో ఉన్న బంగారపు నాంతాడు, అంజమ్మ చేతులకు ఉన్న నకిలీ గాజులను అపహరించారు. మృతులలో ఒకరి చేతిలో కర్రను, మరొకరి చేతిలో తూకం రాయిని ఉంచి, వారిద్దరూ పరస్పరం ఘర్షణ పడడంతో మృతి చెందారన్న భ్రమ కల్పించే యత్నం చేసి ఉడాయించారు. ఆ రోజు చెన్నైలోని రాజేశ్వరి కుమార్తె ఫోన్ చేసినా ఇద్దరిలో ఎవ్వరూ స్పందించకపోవడటం, సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి వెళ్లిన ఆనవాళు కనిపించడంతో కంగారు పడిన ఆమె, సమీప బంధువులైన వీరేష్, రాజారావును ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. వారు వచ్చి చూడగా రాజేశ్వరి, అంజమ్మ రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నారు. విషయాన్ని వెంటనే వారు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు సిసి కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితులను అదుపులో తీసుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించారు. నిందితులు అపహరించిన బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.లక్ష తీసుకొని వాటిలో కొంత నగదును ఖర్చు చేయగా మిగిలిన రూ.34,500 నగదు, నాంతాడు, నకిలీ గాజులను, వారు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లకు సిసి కెమెరా అమర్చుకోవాలని, ఒంటరిగా ఉంటున్న మహిళలు బంగారపు ఆభరణాలను బ్యాంకులలో దాచుకోవాలని డీఎస్పి సూచించారు. కాగా ఈ కేసులో నిందితురాలైన మహిళ కుసుమకుమారి గతంలో కూడా ఇదే తరహాలో మరో మహిళను కూడా హతమార్చి బంగారం అపహరించినట్లు తమ దృష్టికి వచ్చినట్లు డీఎస్పీ చెప్పారు. మూడ్రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసిన సిఐ ఎస్.రమేష్‌బాబు, ఎస్సై షేక్ కరిముల్లా, సిబ్బంది పి.మురళి, ఎస్.జయకర్, డి.సురేష్‌బాబు, కళ్యాణిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు.



పీసెట్ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఎపిపీసెట్-2025లో భాగంగా క్రీడా పరీక్షలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీసెట్ చైర్మన్, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు మొత్తం 530 మంది పురుష అభ్యర్థులకు గాను 400 మంది హాజరయ్యారని కన్వీనర్ పిపిఎస్ పాల్‌కుమార్ తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్, వంటి అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో నైపుణ్యాలు పరీక్షిస్తామని, అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తామని వివరించారు.

నేటి షెడ్యూల్ : మంగళవారం హల్ టికెట్ నంబరు 20531 నుండి 21060 వరకు మొత్తం 530 మంది పురుష అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు పాల్ కుమార్ తెలిపారు.



సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సకాలంలో బిల్లులు రాకపోయినా ఎదురు పెట్టుబడి పెట్టి సెంటర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరేళ్లుగా అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్‌కు రూ.11500, హెల్పర్‌కు రూ.7000 వేలు ఇస్తున్నారన్నారని, కానీ అంగన్‌వాడీలకు తల్లికి వందనం వర్తింప చేయలేదని అన్నారు. నెలకు రూ.12వేల వేతనంలోపు ఉన్న వారికి పథకం వర్తిస్తుందని చెబుతున్న ప్రభుత్వం అంగన్‌వాడీలకు మాత్రం ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 42 రెండ్రోజులపాటు సమ్మె చేసిన అంగన్‌వాడీలకు సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జిఒలు విడుదల చేయాలన్నారు. మినీ సెంటర్లలో టీచర్, ఆయాల పని ఒక్కరే నిర్వహిస్తూ పనిభారం మోయాల్సి వస్తోందని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అనేక సంవత్సరాలుగా ఈ సమస్యపై ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం సాచివేత దోరణి ప్రదర్శించటం తగదన్నారు. ఎవిఎన్ కుమారి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సాధికారత సర్వేలో అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం తొలగించాలని, రేషన్ కార్డులు, పెన్షనర్లు, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి వై.నేతాజి, నగర తూర్పు, పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, బి.ముత్యాలరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రేమలత, హేమలత, రత్నమంజుల, విజయ పాల్గొని మద్దతు తెలిపారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందచేశారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. దీంతో వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. ప్రస్తుతం భారీ వాహనాలనే మళ్లించామని, త్వరలో మిగతా వాటిని కూడా మళ్లిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అయితే రహదారులను పూర్తి స్థాయిలో విస్తరించి సిద్ధం చేయడంలో కార్పొరేషన్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. మార్కెట్ నుంచి అమరావతి రోడ్డు వెళ్లే బస్సులు, లారీలు, కంటైనర్‌లు ఇతర భారీ వాహనాలను మార్కెట్ నుంచి నగరంపాలెం, కంకరగుంట ఆర్‌వోబి, పట్టాభిపురం, కుందుల రోడ్డు మీదుగా లక్ష్మీపురం, లాడ్జి సెంటర్ మీదుగా మళ్లించారు. కొన్నింటిని గుజ్జనగుండ్ల, జెకెసి కళాశాల మీదుగా అడవితక్కెళ్లపాడు, ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డు లోకి మళ్లించారు. ప్రధానంగా అమరావతి రోడ్డు, లక్ష్మీపురం నుంచి వచ్చే వాహనాలను బ్రిడ్జిపైకి రాకుండా ఇతర మళ్లించే ప్రక్రియ చేపట్టారు. అయితే కార్పొరేషన్ అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధత చేయకుండానే ట్రాఫిక్ మళ్లింపు చేయడం వల్ల వాహనదారులు ఇబ్బదులు పడుతున్నారు. బ్రాడీపేట శంకర్ విలాస్ నుంచి బ్రాడీపేట నాల్గో లైను మీదుగా కంకరగుంట బ్రిడ్జి వరకు ఉన్న ఆక్రమణలు తొలగించలేదు. రోడ్డుపక్కన ఉన్న దుకాణాల వద్ద వందలాది ద్విచక్ర వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కంకరగుంట బ్రిడ్జి నుంచి శంకర్ విలాస్, లక్ష్మీపురం వెళ్లేందుకు కూడా బ్రాడీపేట 18వ అడ్డరోడ్డు మీదుగానే అనుమతించడం వల్ల రద్దీ పెరిగింది. కంకరగుంట నుంచి ఇతర మార్గాల వైపు వెళ్లేందుకు ఒన్‌వే ట్రాఫిక్ నిర్వహించడం మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బృందావన్ గార్డెన్స్ నుంచి కుందుల రోడ్డు మీదుగా కంకరగుంట వైపు వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. కుందుల రోడ్డులో పెద్ద ఎత్తున ఆక్రమణలు ఉన్నాయి. కుందుల రోడ్డు అయ్యప్పస్వామి గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వం బంగ్లా వద్ద ఫ్రీ లెఫ్టుకు అవకాశం ఉన్నా బంగ్లాలో ఉంటున్న అధికారులు 20 అడుగుల మేరకు తమ అధీనంలో పెట్టుకున్నారు. దీంతో ఫ్రీ లెఫ్టుకు అవకాశం లేకుండా పోయింది. కలెక్టర్ కార్యాలయం నుంచి కంకరగుంట అండర్ పాస్ వెళ్లే మార్గంలో కూడా రహదారి విస్తరణ ఇంకా చేపట్టకపోవడంతో ఈ మార్గంలో రద్దీ పెరిగింది. కుందల రోడ్డు నుంచి లాడ్జి సెంటర్‌కు వెళ్లేందుకు లక్ష్మీపురం రోడ్డులో వయా బృందావన్ గార్డెన్స్ రహదారులపై వ్యాపారాలు భారీగా సాగుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆలయ కమిషనర్‌గా ఆదిశేష నాయుడు

ప్రజాశక్తి - దుర్గి : అడిగోప్పల శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయ కమిషనర్‌గా కె.ఆదిశేష నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన సైదమ్మబాయ్ గుంటూరు జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆదిశేష నాయుడు గతంలో అనంతపురం జిల్లాలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ల్యాండ్ కమిషనర్‌గా పని చేశారు.

సంధ్యారాణి ఆత్మహత్య కారకులను కఠినంగా శిక్షించాలి

నిందితులకు కొమ్ముకాసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి - కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - తెనాలి



నిరసనలో సంధ్యారాణి కుటుంబ సభ్యులు, కేఎన్‌పిఎస్ నాయకులు

అదనపు కట్నం కోసం వేధించి చప్పిడి సంధ్యారాణి మృతికి కారణమైన ఆమె భర్త, అత్తమామలపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, నిందితులకు కొమ్ముకాసిన ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలని కెఎన్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ డిమాండ్ చేశారు. సంధ్యారాణి మృతిపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లా కండ్లకుంట గ్రామానికి చెందిన చప్పిడి సంధ్యారాణికి కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన చప్పిడి సంతోష్ కుమార్ తో 2019లో వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదు, ముప్పాతిక ఎకరం పొలం, కొంత బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. అయితే అదనపు కట్నం కావాలంటూ భర్త సతీష్ కుమార్, అత్తమామలు చప్పిడి కుమారి, వసంతరావు, చిన్నమామ చప్పిడి కొండలు వేధింపులకు పాల్పడ్డారు. పైగా సంధ్యారాణిపై దొంగతనం మోపి మానసికంగా, శారీరకంగా హింసించటంతో ఆమె ఏప్రిల్ 24న ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 5వ తేదీ మృతి చెందింది. మృతురాలి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు నిందితులపై తూతూ మంత్రంగా కేసు నమోదు చేశారని, మృతురాలి బంధువుల ఆందోళన ఫలితంగా సెక్షన్లు మార్పు చేశారని చెప్పారు. నిందితులకు కొల్లిపర ఎస్ఐ పి. కోటేశ్వరరావు మొదటి నుంచి కొమ్ము కాశారని ఆరోపించారు. సంధ్యారాణి మృతి చెందినపుడు కేసు రాజీ పడాల్సిందిగా ఆమె తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని, ఇప్పటికైనా నిందితులైన సంధ్యారాణి భర్త సతీష్ కుమార్, అత్తమామలు, చిన్నమామపై సెక్షన్ 304(బి) ప్రకారం కేసు నమోదు చేసి శిక్షించాలని, ఈ కేసులో నిందితులకు వత్తాసు పలికిన ఎస్ఐ కోటేశ్వరరావుపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో కేఎన్‌పిఎస్ నాయకులు చెక్కా బ్రహ్మయ్య, సిహెచ్ అంజి, సిహెచ్ రాజశేఖర్, జంపాల దుర్గ, సంధ్యారాణి తల్లిదండ్రులు ధనలక్ష్మి, ప్రసాద్ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అందేశ్యామ్, న్యాయవాది కనపర్తి బెన్హర్, ఎన్ పోతురాజు, రావూరి రవి, చిన్నమ్మాయి, టి కోటేశ్వరరావు, కే శేషు పాల్గొన్నారు.

మద్యం కేసులో నిందితుల బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈపూరు మండలంలో మద్యం కేసు నింది తులను బైండోవర్ చేసినట్లు సీఐ బి. వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మండల కేంద్రం ఈపూరు గ్రామానికి చెందిన ఒకరిని, ఊడిజర్ల గ్రామానికి చెందిన మరొకరిని స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో బైండోవర్ చేశారు. ఈపూరు సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల సమయాలను ఆకస్మికంగా తనిఖీ చేయటం, ఎక్సైజ్ యాప్ ద్వారా మద్యం దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని సీఐ తెలిపారు.

గుండె సంబంధిత వైద్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో గుండె సంబంధిత సేవలు ప్రారంభమైనట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సింగ రాజు సాయికృష్ణ తెలిపారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ ఎండి డిఎం ఆధ్వర్యంలో గుండె సం బంధిత వ్యాధులకు ప్రతి ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు చూస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సత్తెనపల్లి పట్టణ, పరిసర గ్రామల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



జాబ్‌మేళాకు 300 మంది హాజరు

ప్రజాశక్తి - మాచర్ల

నిరుద్యోగ సమస్య పరిష్కారమైతే అనేక సమస్యల పరిష్కారంతో పాటు, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి అన్నారు. వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు 15 కంపెనీలు హాజరవగా 300 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. కంపెనీలు నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన కొందరికి కాల్ లెటర్స్ ఇవ్వగా, మరి కొందరికి తదుపరి టెస్టులకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టరు సాంబేలు శాంతిబాయి తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలయ్య, నరసింహారావు, టి.నరసింహారావు, రేవతి, కె.రవి, జె.జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు.


పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

పొగాకును పారదర్శకంగా కొనాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - యడ్లపాడు

మైదవోలులో స్పైసెస్ పార్కులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పరిశీలించారు. కొనుగోలులో పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ.12 వేల ధర ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని రైతులకు సూచించారు. నియోజకవర్గంలోని 3 మండలాల్లోని 72 గ్రామాల్లో రైతులు పొగాకు పంటను పండిస్తున్నారని, మొత్తం పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.



టీ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తెలంగాణ ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన టి జంక్షన్ వద్ద సోమవారం ఎస్ఐ డి.అశోక్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐమాట్లాడుతూ డ్రైవర్‌లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని బుల్లెట్ వాహనాన్ని సీజ్ చేశారు.

వైసిపి 'యువత పోరు' నిరసనపై లాఠీఛార్జి

కూటమి మోసంపై యువతలో అసంతృప్తి - ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా లక్షలాదిమంది వాలంటీర్ల తొలగింపు : గౌతమ్‌రెడ్డి, మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కోసం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసిపి విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో సోమవారం 'యువత పోరు నిరసన' కార్యక్రమాన్ని చేపట్టారు. వైసిపి జిల్లా కార్యాలయం నుంచి సుమారు 400 మంది కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు ఇంతమందిని పంపించడానికి అనుమతి లేదని, 50 మందినే పంపగలమని పోలీసులు చెప్పారు. అయితే తామంతా వెళ్లాల్సిందేనంటూ నిరసనకారులు ముందుకు కదలడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో వారు చెల్లాచెదురయ్యారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. లాఠీఛార్జిని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఖండించారు. పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టించారని, కొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వైసిపి నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త గౌతమ్‌రెడ్డి విమర్శించారు. కలెక్టరేట్ వద్ద నిరసన అనంతరం కలెక్టర్‌కు గౌతమ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలప్పుడు చెప్పిన కూటమి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, 2014-19 మధ్య కాలంలోనూ టిడిపి అధికారంలో ఉండగా నిరుద్యోగ భృతి హామీని విస్మరించిందని అన్నారు. ప్రస్తుతం రెండు లక్షల నిరుద్యోగులకు రూ.7200 కోట్లు భృతి ఇవ్వాల్సి ఉందని, ఏడాదిలో ఇది రూ.3200 కోట్లవుతుందని వివరించారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా లక్షలాది వాలంటీర్లను తొలగించడం దుర్మార్గమన్నారు. మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 8 లక్షల ఉద్యోగాలిచ్చినట్లు చెబుతున్నారని, ఎక్కడ, ఎవరికి ఇచ్చారో మాత్రం తెలియదని ఎద్దేవ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సత్వరం విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

షూటింగ్ బాల్ జాతీయస్థాయి పోటీలకు వివేకానంద విద్యానికేతన్ విద్యార్థి

ప్రజాశక్తి - పెదకూరపాడు

44వ సబ్ జూనియర్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని శ్రీ వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థి మద్దెల నాగమణికంఠ ఎంపికయ్యాడు. ఈ పోటీలు బీహార్‌లో బుద్ధగయలో ఆగస్టు 22, 23, 24 తేదీల్లో జరగనున్నాయి. జాతీయ స్థాయిలోనూ మణికంఠ ఉత్తమ ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మణికంఠను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోపాటు పలువురు అభినందించారు.


మణికంఠను అభినందిస్తున్న హెచ్‌ఎం శిరీష, తల్లిదండ్రులు

ప్రభుత్వానికి ధాన్యం అమ్మి రెండు నెలలైనా డబ్బులివ్వలేదు

పల్నాడు కలెక్టర్ గ్రీవెన్స్‌లో రైతుల ఆవేదన - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 211 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 211 అర్జీలను ప్రజల నుండి కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ మురళి స్వీకరించారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదార్లతో ముఖాముఖి మాట్లాడి వారికి భరోసా కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పంపాలన్నారు.


ధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతుల వినతి

ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తే 48 గంటలలో నేరుగా ఖాతాకు జమ చేస్తారని భావించి ధాన్యం విక్రయిస్తే 2 నెలలు కావొస్తున్నా ధాన్యం డబ్బులు తమ ఖాతాకు జమ కాలేదని నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన వజ్జా వెంకట రామయ్య, జవ్వాజి హనుమంతరావు, తిరువీధుల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. వెంకట రామయ్య మాట్లాడుతూ తానొక్కడే రూ.5 లక్షల విలువైన 16 టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించానన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నం కావడం, విద్యా సంస్థల ఫీజులు చెల్లింపులు కుటుంబ ఖర్చులు ఇతర పెట్టుబడులు కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోయారు.


పశువులు దొంగిలించిన వారి నుండి పరిహారం ఇప్పించాలని వినతి

కరోన సమయంలో, ఇటీవల కొన్ని నెలల 32 మంది పశు పోషకులకు చెందిన 80 గేదెలు అపహరణకు గురయ్యాయని, అనుమానితులపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారని పెదకూరపాడుకు చెందిన పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. పెదకూరపాడుకు చెందిన గుప్తా గంగాధర్, షేక్ అబ్దుల్ గఫూర్, యర్రం శెట్టి భూపతి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా చింతగుర్తి గ్రామానికి గుడిపూడి రంగా నలుగురు కలిసి మేతకు వెళ్లిన గేదెలను అక్రమంగా దొంగిలించి జల్సాలు చేస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నిందుతులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారని, కొందరికి న్యాయం చేసినా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో దళితులకు, మరికొందరికి న్యాయం జరగలేదని చెప్పారు. ఫిర్యాదు చేసినవారిలో కంచర్ల చిన్న సుశీల, పఠాన్ సర్‌తాజ్, పరగటి తులసమ్మ, తురకా సుశీల, భాష్యం నాగవర్ధిని ఉన్నారు.

డ్వాక్రా డబ్బులు వాడుకున్న యానిమేటర్‌పై ఫిర్యాదు

రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామంలో నాగమ్మ అనే డ్వాక్రా గ్రూపు సభ్యులు తమ రూ.8.40 వేలను



బ్యాంకులో జమ చేయడానికి యానిమేటర్ మస్తాన్‌వలికి ఇవ్వగా కొంత జమచేసి, మిగతా డబ్బును ఖర్చులకు వాడుకున్నట్లు గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. తమ గ్రూపు రూ.5 లక్షల బకాయి ఉందని, దాన్ని చెల్లించాలని బ్యాంక్ మేనేజరు ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై స్వయంగా బ్యాంక్ అధికారులు పోలీసుల ద్వారా విచారణ జరిపి తప్పు జరిగిందని తేల్చారని చెప్పారు. డబ్బు వాడుకున్న యానిమేటర్ నుండి రికవరీ చేయడంతోపాటు అతనిపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మీరయ్య కోరారు.

గృహ నిర్మాణ కాలనీల్లో పనులపై వారంలో నివేదికివ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద చేపట్టిన గృహ నిర్మాణ కాలనీల అభివృద్ధి పనుల తనిఖీలను పారదర్శకంగా నిర్వహించి వారం రోజుల్లో నివేదికివ్వాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. ఈ అంశంపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమీక్షించారు. పనుల పురోగతిని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పనుల తనిఖీ కోసం 18 బృందాలను ఏర్పాటు చేయగా మొత్తం 741 పనుల్లో ఇప్పటి వరకు 277 పనుల తనిఖీ మాత్రమే పూర్తయిందని, మిగిలిన 464 పనుల తనిఖీని వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణ పీడీ వేణుగోపాలరావు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ జె.ప్రభాకర్, తనిఖీ బృందాలు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై మహిళలంతా ఐక్యంగా పోరాడాలి : ఐద్వా

ప్రజాశక్తి - పెదనందిపాడు

తమ సమస్యలపై మహిళలంతా ఐక్యంగా పోరాటం చేయాలని ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ పిలుపునిచ్చారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఐద్వా మండల విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. అరుణ మాట్లాడుతూ మహిళలపై దాడులు పెరిగి పోయాయని ప్రేమ పేరుతో మోసాలు, సామూహిక అత్యాచారాలు, గొంతు కోసి చంపడం, గృహహింస లాంటివి అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. దీనికి ముఖ్య కారణం మద్యం అని అన్నారు .ప్రభుత్వం మద్యంపై కోట్లాది రూపాయలు ఆర్జిస్తుందని అన్నారు. టీవీ సీరియల్స్ సమాజాన్ని చెడగొడుతున్నాయని చెప్పారు. ఉదయం నుండి రాత్రి నిద్రపోయే వరకు మహిళలు టి.వి.కి



మాట్లాడుతున్న ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ

అంటుకుపోయి బానిసలయ్యారన్నారు. ఆ సీరియల్స్‌లో క్రూరత్వం, కుట్రలు కుతంత్రాలు, అశ్లీలం అధికంగా చూపిస్తున్నారని అన్నారు. ఇంటర్ నెట్‌లో అశ్లీల చిత్రాలు, ఫొటోలు చొప్పించడం ద్వారా యువకులు అవి చూసి చెడిపోతున్నారని, అత్యాచారాలకు పాల్పడుతున్నారని, వాటిని తక్షణమే తొలగించాలని అన్నారు. మహిళలు నేటి సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పౌష్టికాహారం లేక జబ్బుల బారిన పడుతున్నారని, అనారోగ్యంతో జీవితం కొనసాగిస్తున్నారని అన్నారు. మహిళలపై ఇంటా, బయట వేధింపులు అధికమయ్యాయని, పని ప్రదేశంలో శ్రామిక మహిళలను యజమానులు వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నింటి, కొనలేని పరిస్థితుల్లో, కుటుంబాన్ని నడపడం మహిళలకు కష్టంగా ఉందని అన్నారు. మహిళలు సమాజంలో సగభాగంగా ఉన్నారని అన్నారు. మహిళల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘం ఏర్పాటు చేసుకొని, ఐక్యంగా పోరాటం చేయడం ఒకటే మార్గమని పిలుపునిచ్చారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పల పూడి రమేష్ బాబు, ఫణిదపు భువనేశ్వరి, కొర్రపాటి లక్ష్మి, పర్వీన్, సలీం, పార్వతి, వెరోనికా శ్రావణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

202వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 202వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను బి.సూర్యప్రకాశరావు, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలలో కె.విజయమోహనరావు, సిహెచ్.పిచ్చయ్య, షేక్ ఇస్మాయిల్, కాసమ్మ, వై.రమాదేవి కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని చెప్పారు. చట్ట ప్రకారం తమకు రావలసిన నష్టపరిహారం మాత్రమే తాను కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, వై.సాంబశివరావు, షేక్ బాషా, బొందలపాటి జోజి, డీసువర్ణకుమారి, యు. రమణ, శివకుమారి, హిమాంబి, శారద, సుభాని పాల్గొన్నారు.



ప్రోత్సాహాలు అందించిన ఎంఈఓ బాబు, కంపెనీ అధికారులు

పేద విద్యార్థులకు పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రాఫిట్ షఉ కంపెనీ ప్రోత్సాహ పురస్కారాలను సోమవారం అందజేశారు. పట్టణంలోని ప్రాఫిట్ షఉ షాపులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాబు మాట్లాడుతూ మంగళగిరి మున్సిపల్ హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరిసిన ఈ విద్య కుసుమాలు సమాజంలో ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన అన్నారు. ప్రాఫిట్ షఉ కంపెనీ అధినేత బి.ఎస్,కోటేశ్వరరావు విద్యార్థులకు చేయూత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. మంగళగిరిలో ప్రథమ స్థానం సాధించిన పి.వరుణ్ సాయి , రెండవ స్థానం సాధించిన, జొన్నాదుల స్నేహ శ్రీకి జ్ఞాపిక అందజేస ఘనంగా సత్కరించి, కాలేజ్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మున్సిపల్ హై స్కూల్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ప్రాఫిట్ షఉ కంపెనీ ఏరియా మేనేజర్ ఎస్.కె.ఖాదర్, జి.కళ్యాణ్ పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి



సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక జరిగే సమ్మె నోటీసును సోమవారం ఏఐటీయూసీ, సిఐటియు, ఏఐఎఫ్టియు న్యూ, వైయస్సార్ టియు నాయకులు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కే శకుంతలను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమ్మె నోటీసులను అందజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అందువలన మున్సిపల్ కార్మికులంతా సమ్మెలో పాల్గొనే విధంగా సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, గండికోట దుర్గారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వరమ్మ, వై.శివ నాగేశ్వరావు, శంకర్రావు, ఏఐఎస్టియున్యూ నాయకులు కె. కోటేశ్వర రావు, వైఎస్సార్‌టియు నాయకులు ఎస్.శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నివశిస్తున్న పేదల ఇళ్లను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరుపేదలు 5వ సచివాలయంలో ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదల ఇండ్లను రెగ్యులర్ చేయాలని, ఇండ్ల స్థలాల అర్జీలు సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శికి ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదల కాలనీలు సుందరయ్య కాలనీ స్వర్ణ పూరి కాలనీ శ్రీ లక్ష్మీ దుర్గ శివ కాలనీ ఎన్టీఆర్ కాలనీ వడ్డెర కాలనీ జాన్ హార్స్ ఫర్ కాలనీ తదితర కాలనీలలో నివాసం ఉంటున్న పేదల పేరుతో జీవో నెంబర్ 30 ప్రకారం రెగ్యులర్ చేయాలని ఆన్నారు. దీర్ఘకాలికంగా అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు అర్జీలు పెట్టి ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలాగా తిరిగినా అధికారులు సమస్యలు పరిష్కారం చేయటం లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు రెగ్యులర్ చేయాలని జీవో నెంబర్ 30ప్రకారం రిజిస్ట్రేషన్



అర్జీలు అందజేస్తున్న నన్నపనేని శివాజీ

చేయాలని, రోడ్లు, డ్రెయినేజి, తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బురదగుంట సాంబయ్య కోటిపల్లి సత్యనారాయణ సంకురి నీలాంబరం సుందరయ్య కాలనీ వాసులు షేక్ మీరావలి, పూర్ణకంటి నాగమణి, జెట్టి రాజలక్ష్మి, షేక్ మస్తానమ్మ, ఎం.వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.





తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు, కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సమస్యల వలయంలో ఇమ్మి కాలేజీ నర్సింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక ఇమ్మి నర్సింగ్ కాలేజి విద్యార్థులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక తహశీల్దార్‌కు సోమవారం వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ కుమార్ మాట్లాడుతూ కళాశాలలో వివిధ ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు నానా అవస్తుల పడుతున్నారని, మానసికంగా ఒత్తిళ్లకు గురవుతున్నామని తెలిపారు. కళాశాలలో సరైన ఉపాధ్యాయులు లేరని, ప్రాథమిక అవసరాలకు, మౌలిక వసతులు లేవని, తాగునీరు, భోజనం, టాయిలెట్స్, మురుగునీరు బయటకు వెళ్లే సదుపాయాలు కరెంటు సౌకర్యం లేవని వివరించారు. హాస్టల్ ఫీజు మొదట చెప్పిన దానికంటే ప్రతి నెలా ఒక్కొక్కరి నుండి 1500 రూపాయలు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హాజరు శాతం 75 కంటే తక్కువ ఉంటే కండిషన్ ఫీజు కింద 30 నుండి 50 వేల వరకు వసూలు చేస్తున్నారని, పరీక్షల సమయంలో హాల్ టికెట్స్ ఇవ్వకుండా మానసికంగా అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారని చెప్పారు. సెలవులు సమయంలో సొంత గ్రామాలకు వెళ్లి తిరిగి కాలేజీలో జాయిన్ అయ్యేటప్పుడు ఒక్కరోజు ఆలస్యం అయితే రోజుకి 500 చొప్పున వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ చేసి చెప్పినా కూడా వినడం లేదని విమర్శించారు. విద్యార్థులతో ప్రయివేటు ఆస్పత్రులలో డ్యూటీ చేయించి వచ్చిన జీతం యాజమాన్యం తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులను చూడడానికి వచ్చిన తల్లిదండ్రులను కూడా మాట్లాడడానికి వీలు లేకుండా చేస్తున్నారని సుదూర ప్రాంతాలు వేరువేరు ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆడపిల్లలు తెలిపారు. కాలేజీలో విద్యార్థులు చేరేటప్పుడు చెప్పిన ఫీజులు వేరని ఇప్పుడు అదనంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థినీ విద్యార్థులు మీడియా వారి ముందు వాపోయారు. ఈ సమస్యలన్నిటిని వినతి పత్రం రూపంలో స్థానిక తహసీల్దార్ జయప్రదరావుకు విద్యార్థిని విద్యార్థులు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చెప్పినటువంటి సమస్యలన్నింటిని కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపాల్ , మేనేజ్‌మెంట్ వారితో మాట్లాడి పరిష్కరిస్తానని తహశీల్దార్ తెలిపారు. ఫోనులో కాలేజీ యాజమాన్యం వారితో మాట్లాడి విద్యార్థినీ విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

గుర్రపు డెక్కను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

నిత్యం కొన్ని లక్షల మందికి మంచినీరు పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువ గుర్రపు డెక్కతో పుడుకుపోయిందని తక్షణమే గుర్రపు డెక్కను తొలగించాలని కాలవ కట్టలు మరమ్మతులు చేపించాలని లాకులు తుప్పు పట్టి శిధిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మాణం చేయాలని సోమవారం పెదకాకాని తాసిల్దార్ కార్యాలయం గ్రీవెన్స్ లో రైతులు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కొన్ని లక్షల మందికి మంచి నీరు పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువ గుర్రపు డెక్కతో పుడుకుపోయిందని తక్షణమే గుర్రపు డెక్క తొలగించాలని కాలువ కట్టలు అనేక చోట కోతకు గురి అయినాయని కాల్వ కట్టలు మర మత్తులు చేయాలని పెదకాకాని నుండి గోళ్ళమూడి వెళ్లే రోడ్డు కాలువ లాకులు తుప్పు పట్టి నిర్వహణ సరిలేఖ శిధిలావస్థకు చేరాయని లాకులు మరమత్తులు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సంకురి నీలాంబరం, సిఐటియు నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వెనిగండ్ల మెడికల్ ఆఫీసర్‌గా ప్రవీణ

ప్రజాశక్తి - పెదకాకాని



మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గా జి.ప్రవీణ సోమవారం విధుల్లో చేరారు.1992 గుంటూరు మెడికల్ కళాశాల బ్యాచ్ కి చెందిన ప్రవీణ జాగర్లమూడి, పిట్టలవానిపాలెం,చేబ్రోలు,అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్లో పనిచేసి సాధారణ బదిలీపై పెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వచ్చారు.గ్రామ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రోగులకు సేవ చేస్తానని ఆమె తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

అవగాహనతోనే సికిల్ సెల్ నిర్మూలన

ప్రజాశక్తి - క్రోసూరు

సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించ వచ్చిని వైద్య అధికారిని సిరి చందన, ఆరోగ్య విస్త రణాధికారి శిఖా శాంసన్ అన్నారు. ఈనెల 19 నుంచి జూలై రెండవ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు సోమవారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలం పెరిగిపాడు తండా పాఠశాలలో అవగాహన సదస్సు జరిగింది. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరి మాట్లాడుతూ 2047కు ముందే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నా రు సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్‌వ్యాధిలో ఈ కణాలు కొడవటి ఆకారంలో ఉంటాయన్నారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికం గా సంక్రమిస్తుందనీ, అంటువ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చు అన్నారు. శిఖా శాంసన్ మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన తెగలకే సోకుతుం దని, వారిలో మేనరికాలు ఒకే రక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధిని గుర్తించిన వెంటనే చికిత్స ఇప్పించడం వల్ల రోగులను ప్రాణా పాయం నుంచి కాపాడ వచ్చు అని పేర్కొన్నారు. ఐదేళ్ల నుండి 40 ఏళ్లలోపు గిరిజనులకు ద్వారా సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్యకర్త నాగమల్లేశ్వరి, ఆశా కార్యకర్త సైదాబీ పాల్గొన్నారు.

జూలకంటి అక్కిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు జూలకంటి అక్కిరెడ్డి జన్మ దిన వేడుకలను టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యం లో సోమవారం విజయ పురిసౌత్‌లో ఘనంగా నిర్వ హించారు. హైదరాబాద్ నుంచి మాచర్ల వెళుతూ నాగా ర్జున సాగర్ సరిహద్దుకు అక్కిరెడ్డి చేరుకోగానే అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి బాణా సంచాకాల్చుతూ సంబరాలు జరిపారు. అనంతరం అక్కిరెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కేసిరెడ్డి హనిమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంటా ధనుంజయరావు, బొబ్బిలి చంద్రశేఖర్, జనసేన అధ్య క్షుడు రాహుల్, సన్నీ, బన్ను, వస్తుపూరి శ్రీరామూర్తి, పి.వీరా రెడ్డి, గోసల జగదీష్, షాజీర్, బిన్ని, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పండు, చరణ్, ఆనంద్ సాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక రింగ్ రోడ్డు నుండి పార్క్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అభిమానులు అక్కిరెడ్డికి ఘనంగా పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమ క్షంలో భారీ కేక్ కట్ చేశారు. తన జన్మదిన వేడుకలు నిర్వ హించి, శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలకు, అభిమానులకు, మిత్రులకు, శ్రేయోభిలాషు లకు అక్కిరెడ్డి కృతజ్ఞతలు తెలియ జేశారు.



డిగ్రీ కాలేజీ భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ విద్యార్థి సంఘ నాయకులు, కాలేజీ విద్యార్థులు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గారిని ఆదివారం రాత్రి కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి మొత్తం 38 ఎకరాలు ఉండగా కొందరు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మహంకాళి సుబ్బారావు వివరించారు. సర్వేనెంబర్ 949 లో ఉన్న డిగ్రీ కాలేజీ భూమి 5.10 ఎకరాలను పట్టణానికి చెందిన కొందరు మాభూమి అంటూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆ భూమిని ప్రభుత్వం వారి వద్ద నుండి తీసుకొని మరోచోట ప్రత్యామ్నాయంగా ఇవ్వటం జరిగిందని వివరించారు. ఆ వ్యక్తులు ఆ భూమిని వదిలేసి కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనీ, రెవెన్యూ అధికారులు వాళ్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ 22(1) ప్రభుత్వ నిషేధిత భూముల జాబితాలో ఉన్న 5.10 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూమిని కొనుగోలు, వారసత్వాల కింద ఆన్‌లైన్ అడంగల్, వన్ బిలో చేర్చారని తెలిపారు. డిగ్రీ కాలేజీ భూమికి రెవిన్యూ రికార్డులను తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని చీఫ్ విప్ జీవిని కోరారు. ఆయన స్పందిస్తూ అధికారులచే సమగ్ర విచారణ చేయించి కాలేజీ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి అక్రమణ కాకుండా, అక్రమాలు జరగకుండా కాపాడేందుకు సహకరించాలని కోరుతూ విద్యార్థులు సిపిఐ, సిపిఎం, పిడిఎం, వైసిపి, టిడిపి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, కాంగ్రెస్, జనసేన అన్ని రాజకీయ పార్టీలు మద్దతుకై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంద శివకుమార్, రాజేష్, డేవిడ్, ఆదిత్య,వాసు,రవి,ప్రభాస్, మస్తాన్ వలి, నాగూర్‌వలి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

దుర్గి తహశీల్దార్‌గా కిరణ్ కుమార్

ప్రజాశక్తి- దుర్గి

దుర్గి మండల తహసిల్దార్ (ఎఫ్ఏజి)గా బందెల కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహశీల్దార్ ఫణీంద్ర కుమార్ సెలవుపై వెళ్లడంతో కిరణ్‌కుమార్ బదిలీపై వచ్చారు. కిరణ్ కుమార్ నాలుగు నెలలుగా మాచర్ల తహశీల్దారుగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో వినుకొండ మండల తహశీల్దారుగా పని చేసి అనంతరం గుంటూరు కలెక్టరేట్ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వహించారు. బందెల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా విధులు నిర్వహిస్తానని విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలి

తహశీల్దార్, ఎంఇఒకు విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు ఫీజు వసూళ్లల్లో ఎక్కడా నిబంధనలు పాటించటం కానీ..చట్టం ప్రకారం వసూలు చేయటం కానీ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతు న్నారని ప్రజా సంఘాలు,అఖిల భారత యువజన సమాఖ్యా నాయకులు అన్నారు. సోమవారం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా స్థానిక తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ , మండల విద్యాశా అధికారిణి వి.వి.ఎస్ చంద్రకళకు నాయ కులు వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజ మాన్యాలు విద్యార్థుల బదిలి ధ్రువీకరణ పత్రం (టి.సి)పై అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని పేర్కొ న్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడ మైదానాలు, కనీస సౌక ర్యాలు, లైబ్రరీలు లేవు, నిబంధనలు పాటించని సంస్థలకు అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి 800 నుంచి 2,220 చదరపు మీటర్ల క్రీడా మైదానం ఉండాలనే నిబం ధనలున్నాయి. అయితే మండలంలో చాలా పాఠశాలల్లో ఇరుకు గదులు, కొన్నిచోట్ల అపార్టుమెంట్లలో తరగతులు నడిపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని జీవో జారీ చేసినప్పటికీ పాఠ శాల యాజమాన్యలు స్పందించటం లేదనీ, అటువంటి పాఠ శాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బి. శ్రీను నాయక్,ప్రైవేట్ టీచింగ్ ప్రొ ఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవుల రాంబాబు, ఏఐవైఫ్ నాయ కులు వెంకటేష్, మల్లికార్జున్, రాంబాబు నాయక్, నాయకులు పుట్టా వెంకట బుల్లోడు, చలికినీడి నాగరాజు, డి గోపి నాయక్, ప్రసాద్ నాయక్, శీను నాయక్, కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌కు గుంటూరు జిల్లా కన్స్యూమర్ కోర్టు జరిమాన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల మానసిక వేదనకు గురైన ఎస్‌సి. మహిళకు రూ. 9,000లను పరిహారంగా చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఉత్తర్వులు సోమవారంజారీ చేసింది. వివరాల ప్రకారము స్థానిక పసుమర్రు గ్రామానికి చెందిన పచ్చికర్ల మరియమ్మ భర్త రవికుమార్ (భీముడు) అనే ఎస్‌సి మహిళకు యూనియన్ బ్యాంక్ పసుమర్రు శాఖలో ఖాతా ఉంది. అందులో డబ్బును పొదుపు చేసుకుంటోంది. 2021 నవంబర్ 29న రూ.6,500, 2022 ఏప్రిల్ 4న రూ.10వేలు, మొత్తం రూ.16,500 నా అనుమతి లేకుండా తీసి నా భర్త పేరిట ఉన్న లోన్ ఖాతాకు బ్యాంకు వారు జమ చేశారని ఆమె తెలిపింది. ఈ విషయమై ఆమె బ్యాంకు అధికారులను ప్రశ్నించగా, వారు తగిన సమాధానం ఇవ్వకుండా రెండేళ్లుగా ఆమెను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయమై ఆమె రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్యాంక్ ఓంబుడ్సమ్ న్‌కి ఫిర్యాదు చేసింది. అయితే ఖాతాదారుని అనుమతి లేకుండా సదరు ఖాతాని ఉపయోగించడం తప్ప ని తేలడంతో బ్యాంకు వారు తిరిగి ఆమె ఖాతాలోకి సదరు మొత్తాన్ని రూ.16,500లు సోమవారం జమ చేశారన్నారు. ఖాతాదారుడు అనుమతి లేకుండా రెండేళ్లుగా తన డబ్బును వాడుకున్నందుకు, బ్యాంకు వారు చెప్పిన నిర్లక్ష్యపు సమా ధానానికి ప్రతిగా వినియోగదారుల కోర్టులో కేసు నెం: సిసి/56/2023 ఫిర్యాదు చేయటంతో బ్యాంకు ప్రతినిధులు ఆ మొత్తాన్ని మళ్లీ నా ఖాతాలోకి జమ చేశారన్నారు. ఈ నెల 4వ తేదీన కమిషన్ తన తీర్పును వెల్లడించారన్నారు. ఖాతాదారుని అనుమతి లేకుండా డబ్బు డెబిట్ చేయడాన్ని "సేవల లోపం" (డిఫెన్స్ ఇన్ సర్వీస్)గా పరిగణించి, బ్యాం కు అధికారుల తీరును వినియోగదారుల కమిషన్ తప్పు పట్టిందని ఆమె తెలిపారు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన పిటిషనర్ న్యాయవాది గుదే. రవితేజ మాట్లాడుతు పిటిషనర్‌కు జరిగిన మానసిక వేదన కు రూ.7వేలు, కోర్టు ఖర్చులకు రూ.2వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ తన తీర్పులో తెలుపుతూ ఈ మొత్తాన్ని పసుమర్రు యూనియన్ బ్యాంక్‌శాఖ ఆమెకు 6వారాల లోపు చెల్లించాలి అని ఈ నెల 4వ తారీఖున తీర్పుఇచ్చిందన్నారు. రూ. 9వేలు జమ చేయాల్సి ఉందన్నారు. ఖాతా దారి అనుమతి లేకుండా వారి ఖాతాని ఉపయోగించి నగదు బదిలీ (క్యాష్ ట్రాన్స్‌ఫర్) చేసే అధికారం బ్యాంకుకు లేదనీ, ఇలా చేయ టం బ్యాంకు సేవలో తీవ్రమైన లోపంగా పేర్కొందన్నారు.

టిడిపి శావల్యాపురం మండల పరిశీలకులుగా మొండితోక రామారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో కొనకంచివారిపాలెం గ్రామా నికి చెందిన మాజీఎంపిపి మొండితోక రామారావు శావల్యా పురం మండల టిడిపి పరిశీలకులుగా నియమితులయ్యా రు. ఈ మేరకు టిడిపి అధిష్టానం నుండి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన సోమవారం తెలిపారు. తన నియా మకానికి సహకరించిన ముఖ్యమంత్రికి, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు, రాష్ట్ర గ్రంథా లయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుకు కృతజ్ఞత లు తెలిపారు. వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు, జిడిడిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లి ఖార్జునరావు మాజీ ఎంపిపి



కుర్చీలు బహూకరించిన పద్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండల కేంద్రమైన రొంపిచర్లలో గల అంగన్వాడీ కేంద్రంలో గ్రామానికి చెందిన సరికొండ పద్మ 20 కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ డి.మరియకుమారి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అంగన్వాడీ కేంద్రాలకు అవసర మైన ఇవ్వడం హర్షణీరమన్నారు. ఈ సందర్భంగా పద్మను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్ బి.లక్ష్మీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం లో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి ఆధ్వర్యంలో సోమ వారం నరసరావుపేట, నకరికల్లు, రొంపిచర్ల మండలం లోని వరి విత్తనాలను సరఫరా చేసే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి 53,650 హెక్టార్లలో సాగు చేస్తున్నారని, అందుకోసం 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవుతుందని అం చనా వేశారు. ఆ మేరకు బిపిటి 5204, జేజిఎల్ 384, కేఎన్ఎమ్ 1638, ఎన్ఎల్ఆర్ 34449, అంకుర్ సోనా, హెచ్ఎంటి, బిపిటి 2782, బిపిటి 2846 రకాల వారీగా సరిపడా విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచాలని, రైతులకు అవసరం మేర సకాలంలో సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. విత్తన దుకాణదారులు ఎంఆర్పికి మించి అధిక ధరలకు అమ్మితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులందరూ విత్తనాల ను డీలర్ల వద్దనే కొనుగోలు చేసి బిల్లును తప్పక తీసు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట సహా య వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ, నరస రావు పేట మండల వ్యవసాయాధికారి ఐ.శాంతి, రొంపిచర్ల మం డల వ్యవసాయాధికారి పి. శివలలిత, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, డీలర్లు పాల్గొన్నారు.

డీఎస్సీకి ముందు ప్రమోషన్లు కల్పించండి : ఎస్‌టియు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సోమవారం పట్టణంలోని ఎస్‌టియూ ప్రాం తీయ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలు లేక కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులు క్లస్టర్ వేకెన్సీలో కోరుకున్నారనీ, డీఎస్సీ నియామకాలకు ముందు సీనియర్ ఉపాధ్యాయులకు పాఠశాలలో స్థానం కల్పించి డీఎస్సీ ఉపా ధ్యాయులను క్లస్టర్ వేకెన్సీలో నియమించాలని కోరారు. సమావేశంలో ఎస్‌టియూ పల్నాడు జిల్లా కార్యదర్శి విను కొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి వి.జయప్రకాష్, నాదెండ్ల మండల అధ్య క్షుడు మక్బూల్ బాషా, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎడ్ల పాడు మండలాధ్యక్షుడు జి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, చిలకలూరిపేట మండల అధ్య క్షులు బి.రవి, మండల ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, మల్లేశ్వరరావు జిల్లా మహిళా కన్వీనర్‌ఎం.శారద పాల్గొన్నారు.

విద్యుత్ చట్ట సవరణ, ప్రైవేటీకరణను ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యుత్ చట్ట సంస్కరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం కాకపోయినా, విద్యుత్ చట్ట సంస్కరణలు పేరుతో ప్రజలపై భారాలు వేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ నిరంకుశ వైఖరితో నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యుత్ చట్ట సంస్కరణలు చేస్తుందని ఆయన విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు, ప్రజల నెత్తిన భారాలు వేసేందుకే విద్యుత్ చట్ట సంస్కరణలు తీసుకువస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. చట్ట సంస్కరణల పేరుతో వ్యవసాయ రంగాన్ని దెబ్బ తీసే విధంగా, రైతులపై భారాలు వేసే విధంగా స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను రాష్ట్రాలలో అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను ఆపాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు పగలకొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్, టిడిపి నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నరేంద్ర మోడీ విధానాలని ఆవలంబిస్తూ, ప్రజల నెత్తిన ట్రూ అప్ చార్జీల పేరుతో భారాలు వేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్ సంస్థలకు జేబులు నింపేందుకే కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకుందని ఆయన విమర్శించారు. సామాన్య ప్రజానీకం పైన, రైతుల పైన భారాలు వేయడాన్ని సిపిఎం పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని కాపాడాలని, విద్యుత్ ప్రైవేట్ పరం కాకుండా ఆపాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు డోకిపర్తి రాజేంద్ర బాబు, ఎన్.విజయరాజు, ఎన్.చిన్న, గుండిమెడ ఏసురత్నం, జెట్టి దేవదాసు, పల్లె శివయ్య, గుండిమెడ నాగేష్, దొరబాబు, ఎం.కృష్ణ, జి.నాగేశ్వరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చట్ట సంస్కరణలకు వ్యతిరేకంగా గుండి మెడలో నిరసన చేపట్టిన సిపిఎం నాయకులు



నాయుడమ్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా డాక్టర్ నాయుడమ్మ వర్థంతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రజల శాస్త్రవేత్త, సుప్రసిద్ధ చర్మశాస్త్రజ్ఞులు పద్మశ్రీ డాక్టర్ యెలవర్తి నాయుడమ్మ 46వ వర్ధంతి సభ సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ యెలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ అధ్యక్షులు ఎడ్లపాటి రఘునాథ బాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించిన నాయుడమ్మ నేటి తరం శాస్త్రజ్ఞులకు ఆదర్శం అన్నారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యార్థులు ముఖ్యంగా సైన్స్ విద్యార్థులు నాయుడమ్మ అకుంఠిత దీక్షను, పట్టుదలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ స్వయంకృషితో ఎదిగి జాతీయస్థాయి శాస్త్రజ్ఞుడైన నాయుడమ్మ నేటి విద్యార్థులు అందరికీ ఆదర్శమన్నారు. సిఎస్ఐ ఆర్‌సిఎల్ఆర్ఐ చెన్నై చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వికాంత మాట్లాడుతూ అంటరాని పరిశ్రమని పరిశోధన అంశంగా తీసుకొని చర్మ పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కలిగించిన గొప్ప శాస్త్రజ్ఞుడు నాయుడమ్మ అని కొనియాడారు. కుమార్ పంప్ అధినేత కొత్త సుబ్రమణ్యం అరవింద్ మాట్లాడారు. తొలుత ముందుగా నాయుడమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి జ్యోతి ప్రజ్వలన చేశారు. సావనీర్‌ను అధితులు ఆవిష్కరించారు. ఫౌండేషన్ సెక్రటరీ యెలవర్తి పవన్ కుమార్ వందన సమర్పణ చేశారు.

పదవులకే వన్నె తెచ్చిన జవ్వాది : దానబోయిన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పదవులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పదవులకే వన్నె తీసుకొస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. పెదవడ్లపూడి గ్రామ టీడీపీ కార్యాలయంలో సోమవారం నూతనంగా యార్డ్ చైర్మన్‌గా నియమితులైన జవ్వాదిని సుందరరావు యాదవ్, దేశం తమ్ముళ్లు ఘనంగా సత్కరించారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. కిరణ్ చంద్ రూరల్ తెలుగు యువత అధ్యక్షునిగా రెండుసార్లు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శిగా పదవులను సమర్ధవంతంగా నిర్వహించి ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా పని చేశారన్నారు. గ్రామంలో మంత్రి లోకేష్ స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజల మన్ననలు పొందారున్నారు. యార్డ్ చైర్మన్‌గా రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రి యేసుబాబు, చింకా కోటేశ్వరరావు, దానబోయిన రామారావు, శంకరరావు, రుద్రు శ్రీను, కాకర్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొల్లిపర



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం 20వేల రూపాయలు ఇప్పించాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ జి.సిద్ధార్థకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. 70 - 80 శాతంగా గల కవులు రైతులు ప్రభుత్వం ఇచ్చే సాయం పరిహారము బ్యాంకు రుణాలు అందక తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని మార్పు చేయాలని వినతిపత్రంలో తెలియజేసినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జొన్నలు మొక్కజన్నలు కొనుగోలు కేంద్రాలు తెరిపించి రైతులును కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులుకు సంబంధించిన సమాచారం తీసుకొని వారికి కార్డులు ఇప్పించేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు మురళి పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు పులివర్తి ప్రసాద్ భార్య మృతి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు గ్రామంలోని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పులివర్తి ప్రసాద్ భార్య పులివర్తి అన్నమ్మ (72) అనారోగ్య సమస్యలతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పకీరయ్య మాట్లాడుతూ పార్టీ సభ్యుడు అయిన పులివర్తి ప్రసాద్ పార్టీ చెప్పిన విధంగా ప్రతి సభ్యుడు పార్టీ కార్యక్రమాలకు హాజరవటంతో పాటు కుటుంబ సభ్యులను కూడా తీసుకురావాలి అన్నదానికి కట్టుబడి ఇంట్లో తన సహచరి అన్నమను తీసుకొచ్చేవారు. అలా తీసుకొచ్చిన అన్నమ్మ పార్టీ అభిమానిగా సానుభూతి పరురాలిగా ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనేదని తెలిపారు. వయసు రీత్యా అనారోగ్య సమస్యలు కారణంగా ఈమధ్య పాల్గొనలేకపోయినా, ప్రసాద్‌ను పార్టీ అన్ని కార్యక్రమాలకు పాల్గొనేలా ప్రోత్సహించేదన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం సిపిఐ రూరల్ కార్యదర్శులు వుద్దంటి దుర్గారావు, జాలాది జాన్బాబు, పార్టీ శాఖ కార్యదర్శులు గడ్డం అజయ్ కుమార్, పంతగాని మరియుదాసు, వి.సాంబశివరావు, కె.ఆంజనేయులు, సిహెచ్ సీతారామాంజనేయులు, సిహెచ్.జనార్ధనరావు, పి.వెంకటేశ్వరరావు, గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొలాల్లో అస్తిపంజరం కలకలం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలిలో ఓ గుర్తు తెలియని అస్తిపంజరం కలకలం రేపిస్తుంది. తెనాలి బుర్రిపాలం రోడ్డులో వివేకా సెంట్రల్ స్కూల్ దగ్గర పొలాల్లో అస్తిపంజరం పడి ఉందని గమనించిన నేలపాడు విఆర్‌ఓ బేతాళ ముఖర్జీ పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన తెనాలి రూరల్ పోలీసులు కేసు వివరాలను సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎటువంటి దుర్వాసన లేని ఆడ/మగ తెలియని అస్తిపంజరం ఉందని తెలియడంతో ఘటనా స్థలంలో వివరాలు సేకరించినట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు. బుర్రిపాలెం వివేకా పాఠశాల పరిధిలో ఓ బిచ్చగాడు నెలరోజుల నుండి కనిపించట్లేదని స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అస్థిపంజరం సమీపంలో కాటన్ గళ్ళ లుంగీ ఆనవాళ్లు దొరికాయన్నారు. సదరు అస్తిపంజరం ఆ బిక్షగాడిదేమోనని అనుమానం ఉన్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజా సమస్యలపై తొమ్మిది ఫిర్యాదులు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల ప్రజా పరిష్కార వేదికలో 9అర్జీలు స్వీకరించినట్లు తెనాలి తహశల్దార్ కె.వి.గోపాలకృష్ణ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాల సమస్యలపై-2 తల్లికి వందనం తమ ఖాతాల్లోకి జమా కాలేదంటూ-2, వ్యవసాయ భూమ సమస్యపై-1, ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ రాకపోవడంపై-1, కఠెవరం గ్రామంలో రోడ్డుపై అడ్డంగా గోడ కట్టారని-1, తల్లిదండ్రులను పోషణపై అశ్రద్ధ వహిస్తున్నారంటూ-2 అర్జీలు స్వీకరించినట్లు తహశీల్దార్ తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వఅద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, తల్లిదండ్రులను విస్మరించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులను చూడలేని పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ వర్తిస్తుంది

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదంలో పసుపు పంట నష్టపోయిన రైతులతో పాటు వ్యాపారస్తులకు కూడా బీమా ప్రీమియం వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపినట్లు స్థానిక వ్యాపారస్తులు తెలిపారు. గుంటూరులో జరిగిన గ్రీవెన్స్‌లో సోమవారం వ్యాపారస్తులు ఆమెకు అర్జీని ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యాపారస్తులకు భరోసానిచ్చారు. అనంతరం వ్యాపారస్తులు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. ఆయన కూడా వ్యాపారస్తులకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన హామీతో ఒకింత వ్యాపారస్తులకు పూరిట కలిగినది.

నేడు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - దుగ్గిరాల

విజయవాడ - గూడూరు మధ్య నిర్మాణంలో ఉన్న మూడవ రైల్వే లైను పనుల నిమిత్తం నేడు స్థానిక రైల్వే గేటు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మూసి వేయనున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మార్గం గుండా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించాలని ఆయన కోరారు.

గంజాయి, లిక్విడ్, మత్తు బిళ్లలు స్వాధీనం..

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోలీసులకు పక్కా సమాచారం అందింది. కాజ టోల్ గేట్ వద్ద మాటు వేశారు. అనుకున్న టార్గెట్ రానే వచ్చింది. పోలీసులు ఈగల్ మెరుపు దాడి చేశారు. ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొన్నారు. అతని వద్ద గంజాయి, గంజాయి లిక్విడ్, మత్తు బిళ్ళలను స్వాధీనం చేసుకున్నారు. తమదైన శైలిలో విచారిస్తున్నారు. గంజాయి ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి

గంజాయి స్మగ్లింగ్.. బెంగళూరు అడ్డా.!

గంజాయి స్మగ్లింగ్ కు బెంగళూరు అడ్డాగా మారింది. గత కొన్ని నెలలుగా గంజాయి స్మగ్లింగ్ ముఠా బెంగళూరు ను అడ్డాగా చేసుకుని వివిధ మార్గాలు వివిధ వ్యక్తుల ద్వారా విశాఖపట్నం ప్రాంతానికి తరలిస్తున్నారు. పలుమార్లు పలు ప్రాంతాలలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నప్పటికీ గంజాయి స్మగ్లింగ్ విక్రయాలు ఆగడం లేదు.

పోలీస్ మెరుపు దాడి..

తాజాగా బెంగళూరు నుండి విశాఖపట్నం ప్రాంతానికి ప్రైవేట్ బస్సు ద్వారా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారన్న సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు ఈగల్ పోలీసులు మంగళగిరి మండలం కాజా టోల్గేట్ వద్ద కాపు కాశారు. టోల్గేట్ వద్దకు ప్రైవేటు బస్సు రాగానే పోలీసులు మెరుపు దాడి చేశారు.

ఎఎన్‌యు బిఇడి మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఫిబ్రవరిలో జరిగిన బిఈడి కోర్సు మూడవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను, సీఈ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు మొత్తం 7604 మంది పరీక్షలు రాయిగా వారిలో 6480 మంది 85శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జూలై 9వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించి, రీవాల్యుయేషన్కు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పర్సనల్ వెరిఫికేషన్, ఆన్సర్ బుక్లెట్ జిరాక్స్ కాపీలకు రూ.2190 చెల్లించాలని ఆయన సూచించారు. పీజీ ఫలితాలు విడుదల విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను, సీఈ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. ఎంఎ మ్యూజిక్ వోకల్ మొదటి సెమిస్టర్ లో 15 మందికి 14 మంది, ఎంఏ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్‌లో 11 మందికి ఆరుగురు, మూడవ సెమిస్టర్‌లో ఏడుగురికి ఆరుగురు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు. జూలై 1వ తేదీలోగా రీవాల్యుయేషన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించి తమ దరఖాస్తులు కోఆర్డినేటర్ కార్యాలయానికి అందేలా పంపాలని ఆయన పేర్కొన్నారు.

వైద్య రంగంలో కొత్త శకానికి నాంది

ప్రజాశక్తి-గుంటూరు



ప్రొఫెసర్ గోపాలకృష్ణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైద్యరంగంలో ఆధునిక పదా ర్థాల వాడకం ద్వారా కత్రిమ అవయ వాలు, డెంటల్ ఇంప్లాం ట్లు, బోన్ ప్లేట్స్ వంటి వాటిని శరీరానికి అనుకూ లంగా తయారు చేయడం ఇప్పుడు సాధ్యమ వుతోందని జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ అన్నారు. బయోకం పాటబుల్ పదార్థాలు శరీరంలో తిరస్కరణ లేకుండా పనిచేయడం వల్ల వైద్యరంగంలో ఇది ఒక కొత్త శకానికి నాంది అని అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కాలేజిలో జేఎన్‌టీయూ కాకినాడ సౌజన్యంతో 'అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్' అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో ఖచ్చితత్వంతో కూడిన వస్తు తయారీ అనేది వైమానిక, ఖగోళ పరిశోధనల్లో ఎంతో అవసరమన్నారు. సాంప్రదాయ తయారితోపాటు ఆర్టిఫి షియల్ ఇంటలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్ సహకారంతో మ్యానుఫాక్చరింగ్‌ను అతివేగంగా, ఖచ్చితత్వంగా చేయవచ్చని అన్నారు. ఆటోమొబైల్ రంగమైన వాహనాల తయారీ సంస్థలు ప్రస్తుతం తేలికపాటి కానీ బలమైన పదార్థాలు వంటి పదార్థాలను వాడడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించడమే కాక, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా పనిచేస్తున్నాయని తెలియజేసారు. ఏరోస్పేస్ రంగంలో అధిక బలం, తక్కువ బరువు కలిగిన పదార్థాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని, టిటానియం, కార్బన్ ఫైబర్ వంటి పదార్థాలు విమానాల శరీర భాగాలను నిర్మించడంలో వాడుతున్నారని తెలిపారు. దీనివల్ల విమానాల సమర్థత పెరిగి, ఇంధన వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, జేఎన్‌టీయూ కాకినాడ నుంచి కోఆర్డినేటర్, ఏపీఎంఈ డాక్టర్ ఎం.మధుసూధన ప్రసాద్, విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు, కౌలురైతు సంఘం నాయకుల డిమాండ్ - కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి

ప్రజాశక్తి-గుంటూరు

పొగాకు పంట ఉన్న అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆయా సంఘాల నాయకులు అర్జీ అందశారు. తొలుత చుట్టగుంట వద్ద ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, నాయకులు కె.నాగేశ్వం రావు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూరుగ రామాంజన యులుతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో పొగాకు కొనుగోలు ఏర్పాటు చేయాలని కోరారు. అలా కాకుండా కాకుమాను మండలంలోనే ఏర్పాటు చేస్తే మిగిలిన రెండు మండలాల రైతులకూ దూరం అవుతుందన్నారు. కనీసం పెదనందిపాడులో ఏర్పాటు చేస్తే రైతులు అందరికీ సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అనంతరం నాయకులు రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 11 వేల ఎకరాలు నల్లబర్లీ పొగాకు సాగు చేశారని, పంటచేతికొచ్చి 3 నెలలు దాటినా కొనుగోళ్లు చేయకపోవటంతో రైతులు, సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ జిల్లాలోనే అత్యధిక భాగం పంట పండిన నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. గుంటూరులో ఏర్పాటు చేసినా అంతదూరం రైతులు తీసుకురావటం రైతులకు వ్యయప్రయాలతో కూడుకుందని అన్నారు. ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయరని, కావున రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. కలెక్టరేట్ లో అర్జీ ఇచ్చిన వారిలో రామారావు, అప్పారావు తోపాటు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వ రరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, జె.బాలరాజు, కె.నాగేశ్వరరావు ఉన్నారు.


రైతులులతో మాట్లాడుతున్న నాయకులు


ఎమ్మెల్యేతో వీరాంజనేయులతో మాట్లాడుతున్న నాయకులు

25న సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతులలో అడ్మిషన్లకు ఈనెల 25వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించి, మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్లు సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగుతుల వారికి ఉదయము 11 గంటలనుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 8, 9 తరగతుల వారికి మధ్యాహ్నం 2 గంటలనుండి 3 గంటల వరకు బాలురులకు తాడికొండ గురుకులంలో, బాలికలకు రామకృష్టాపురం (సత్తెనపల్లి)లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం లలో ప్రవేశపరీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒకగంట ముందుగానే రావాల్సి ఉంటుందన్నారు.



లంకభూముల సాగుదార్లకు పట్టాలివ్వాలి..

లంక భూములు సాగు చేసు కున్న చిన్న సన్నకారు రైతులకు పట్టాలు మంజూరు చేయాలని రైతులు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి గ్రీవెన్స్‌లో అర్జీ అంద చేశారు. గత 40 సంవత్స రాలుగా దుగ్గిరాల మండలం, పెద్దకొండూరు లంక భూములు పేద రైతులు 50 మంది సాగు చేసుకుంటున్నామని, ఈ భూములకు కొన్ని సంవ త్సరాల క్రితం డి పట్టాలు ఇచ్చారని, ఈ లంక భూముల్లో పసుపు, కంద, చామదుంపలు, మినుము పంటలు పండిస్తూ కుటుంబ జీవనం సాగిస్తున్నామన్నారు. అకాల వర్షాలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం, సబ్సిడీలు కూడా మాకు దక్కట్లేదని తెలిపారు. ఈ భూములకు ఎలాంటి ఆధారాలు లేవనే కారణంతోనే మాకు ఎలాంటి సాయం దక్కట్లేదన్నారు. కావున సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అర్జీ అందచేసిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.బాలరాజు, ఈమని అప్పారావు, నాయకులు కె.నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 263 అర్జీలు



ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే. ఖాజావలి ప్రజల నుండి 263 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ అధికారి యు.నరసింహరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి బి. రవీంద్ర, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ డి. శైలజ, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయి, జిల్లా పరి శ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, డిఎఫ్ఓ (టెరిటోరియల్) హిమ శైలజ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగుల బదిలీల జీవోను సవరించాలి

సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 5ను సవరించాలని సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ ప్రమోషన్స్‌తో కూడిన బదిలీలు జరపాలని, సొంత మండలాల ప్రాతిపదికన కాకుండా, పట్టణాల్లో వార్డును, గ్రామాల్లో పంచాయితీని ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. స్పష్టమైన సర్వీసు రూల్స్ రూపొందించాలని, ముఖ్యంగా చాలా మంది ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నందున పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలన్నారు. రేషనలైజేషన్ తర్వాత సీనియార్టీ ఆధారంగా వివిధ శాఖల్లోకి బదిలీల చేయాలన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ధనలక్ష్మి, అనురాధ, అబ్దుల్ రజాక్, మధు, రామకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 జెఎల్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి..

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్-2 జెఎల్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఎపిఎస్‌పిఇబి రెగ్యులేషన్స్ వర్తింప చేయాలని, విద్యుత్ సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం బదిలీలు చేపట్టాలని, అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని, జెఎల్‌ఎంలకు రేషనలైజేషన్ పద్ధతి వర్తింప చేయొద్దని, మూడు డిస్కంలో ఒకేరకమైన ఉత్తర్వులు అముల చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారు లకు అంద చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు వి.రాంప్రభాకర్, టౌన్1 అధ్యక్షులు జె.చెన్నకేశవులు ఉన్నారు.



పెన్షనర్ల చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పెన్షన్ చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. 2025 మార్చిలో పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించిన ఈ సవరణల వల్ల పెన్షనర్లను గ్రూపులుగా విభజించి, పాత పెన్షనర్లకు వేతన సవరణ సంఘం సిఫార్సులు అమలు కాకుండా చేసే ప్రయత్నం జరిగిందన్నారు. దీని వల్ల ఉదాహరణకు 2026 జనవరి 1 ముందు రిటైర్ అయిన పెన్షనర్లు, 2026 జనవరి 1 తర్వాత రిటైర్డ్ అయిన పెన్సనర్లు అని విభజించి, 2026 జనవరి1 తర్వాత రిటైర్డ్ అయిన వారికే వేతన సవరణ సంఘం సిఫార్సులు వర్తింప చేస్తారన్నారు. అలాగే చట్ట సవరణ ద్వారా వేతన సంఘం సిఫార్సులు ఏ తేదీ నుండి అమలు కావాలులోకి రావాలో..బకాయిలు చెల్లించాలా వద్దా అనే నిర్ణయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. ఈ నిర్ణయం రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు వర్తించే ప్రమాదం ఉందన్నారు. కావున చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి పి.నాగరాజు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, పెన్షనర్లు పాల్గొన్నారు.

